క్లుప్తంగా

డిపో మేనేజర్‌కు సన్మానం



డిపో మేనేజర్‌ను సత్కరిస్తున్న ఉద్యోగులు

దేవరకొండ: దేవరకొండ ఆర్టీసీ డిపో మేనేజర్ తల్లాడ రమేశ్‌బాబు బండ్లగూడకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా గురువారం డిపోలో వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. అధికారులు, కార్మికులు, ఉద్యోగులు డిపో మేనేజర్ రమేశ్‌బాబు దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో ఏడీఎం పడాల సైదులు, వెలుగు కృష్ణయ్య, సమద్, పాపరాజు, దీప్‌లాల్ పాల్గొన్నారు.

డ్రెయినేజీలను ధ్వంసం చేస్తే చర్యలు తప్పవు



నిలిచిన మురుగు నీటిని పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ

వేములపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు ఏర్పాటు చేసిన డ్రెయినేజీలను ఎవరైనా ధ్వంసం చేస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ హేమలత, ఎంపీడీఓ జితేందర్‌రెడ్డి అన్నారు. వేములపల్లి మండలంలోని బుగ్గబావిగూడెంలో కొందరు డ్రెయినేజీలను బ్లాక్ చేయడంతో వీధుల్లో మురుగు చేరిందని ఫిర్యాదు అందడంతో గురువారం వారు పరిశీలించారు. ధ్వంసమైన డ్రెయినేజీలకు మరమ్మతులు చేపట్టి మురుగునీరు వెళ్లేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ లలిత, ఆర్ఐ స్పందన, కార్యదర్శి సరిత, శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

సీపీఆర్‌పై అవగాహన



మిర్యాలగూడ ఆర్టీసీ బస్టాండ్‌లో సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న జిల్లా మేనేజర్ సలీం

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ ఆర్టీసీ బస్టాండ్‌లో గురువారం జీవీకే ఎంఆర్ఐ 108 ఆధ్వర్యంలో సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. స్పృహ కోల్పోయిన వ్యక్తికి ఏ విధంగా సీపీఆర్ చేయాలన్న దానిపై వివరించారు. 108 జిల్లా మేనేజర్ ఎస్‌కె సలీం మాట్లాడుతూ.. సీపీఆర్‌తో ప్రాణాలు రక్షించవచ్చన్నారు. కార్యక్రమంలో 108 ఎమర్జెన్సీ ఎగ్జిక్యూటివ్ మధు, ఈఎంటీ వెలిజాల సైదులు, పైలెట్ పగిళ్ల జానకిరాములు, డిపో మేనేజర్ రాంమోహన్‌రెడ్డి తదితరులున్నారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

గుర్రంపోడు : ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలకు ఈ నెల 23వ తేదీలోగా పరీక్ష ఫీజు చెల్లించి అడ్మిషన్ తీసుకోవాలని మండల విద్యాధికారి నోముల యాదగిరి, గుర్రంపోడు జెడ్పీ ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ హెచ్‌ఎం సంధ్యారాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఓపెన్ స్కూల్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో సంప్రదించాలని కోరారు.

ఇ-కేవైసీ చేయించుకోవాలి



త్రిపురారంలో ఉపాధి కూలీలకు ఇ-కేవైసీ చేయిస్తున్న ఎంపీఓ శ్యామల

త్రిపురారం : మండల వ్యాప్తంగా గ్రామాల్లో ఉపాధి పనులకు వెళ్లున్న కూలీలు తప్పనిసరిగా గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ వద్ద ఇ-కేవైసీ చేయించుకోవాలని త్రిపురారం ఎంపీఓ శ్యామల అన్నారు. గురువారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ వద్ద ఉపాధి కూలీలకు ఇ-కేవైసీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలో 32 గ్రామ పంచాయతీలలో 16892 ఉపాధి కూలీలకు గాను 11372 మంది కూలీలతో 67 శాతం ఇ-కేవైసీ పూర్తి అయ్యిందన్నారు. ఇతర ప్రాంతాల్లో ఉన్న ఉపాధి కూలీలు ఇ-కేవైసీ పూర్తి చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కొడిరెక్క రాజేంద్ర కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ నేతి వెంకన్న పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ సిగ్నల్ టవర్ మంజూరు

గుర్రంపోడు : మండలంలోని కాచారం గ్రామానికి బీఎస్ఎన్ఎల్ సిగ్నల్ టవర్ మంజూరైనట్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు కంచర్ల విజయేందర్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కాచారంతోపాటు పరిసర గ్రామాల్లో బీఎస్ఎన్ఎల్ సిగ్నల్స్ లేకపోవడంతో టవర్ మంజూరు చేయాలని ఎంపీ రఘువీర్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. ఈమేరకు ఆయన సీజీఎంకు ఫోన్ చేయడంతోపాటు రాతపూర్వకంగా కోరడంతో టవర్ మంజూరైనట్లు పేర్కొన్నారు.

కంకర పరిచి వదిలేశారు

గుర్రంపోడు : గుర్రంపోడు- వెల్మగూడెం గ్రామాల మధ్య రోడ్డు విస్తరణలో భాగంగా చేపూరు- గుర్రంపోడుల మధ్య కంకర పరిచారు. నాలుగు నెలలు గడుస్తున్నా ఈ పనులు పూర్తి చేయలేదు. కంకర రోలింగ్ చేయకపోవడంతో వాహనాలు ప్రమాదాల బారిన పడుతున్నాయి. పనులు నాణ్యతగా జరగడం లేదని, అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.



కంకర పరిచి ఉన్న చేపూరు - గుర్రంపోడు రోడ్డు

రహదారి పక్కనే బావి

చందంపేట : చందంపేట మండలంలోని పోల్యనాయక్‌తండా గ్రామ సమీపంలో మూలమలుపు వద్ద రోడ్డును ఆనుకుని బావి ప్రమాదకరంగా ఉంది. ఎలాంటి రక్షణ లేకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు పేర్కొంటున్నారు. గతంలో ఈ ప్రాంతంలో పలు ప్రమాదాలు చోటుచేసుకోగా.. పలువురు గాయాలపాలయ్యారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదకర మూలమలుపు వద్ద రక్షణ వలయం ఏర్పాటు చేయాలని, రోడ్డును విస్తరించాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.



పోల్యనాయక్‌తండా సమీపంలో మూలమలుపు వద్ద ఉన్న బావి

నిర్వహణ లోపం.. ప్రజలకు శాపం!

- మంచినీటి పథకాల నిర్వహణలో పంచాయతీ, నీటి సరఫరా, మిషన్ భగీరథ అధికారులు విఫలం
- తాగునీరందక నిడమనూరు వాసుల అవస్థలు

నిడమనూరు : పక్కనే కృష్ణమ్మ ప్రవహిస్తున్నా నిడమనూరు వాసులు తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మంచినీటి పథకాల నిర్వహణలో గ్రామ పంచాయతీ, గ్రామీణ నీటి సరఫరా విభాగం, మిషన్ భగీరథ అధికారులు విఫలమవుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. 2006లో రూ.12 కోట్లతో నల్లగొండ జిల్లా కేంద్రానికి తాగునీరు అందించిన ముప్పారం మంచినీటి పథకాన్ని ఆధునీకరించి నిడమనూరుకు కేటాయించారు. మరోసారి 2014లో రూ.3 కోట్లతో నిడమనూరు చెరువు శివారున పంపింగ్ స్టేషన్, 3లక్షల లీటర్ల సామర్థ్యం గల సంపు నిర్మాణం చేపట్టారు. నిర్వహణ లోపాలతో పథకాలన్నీ మూలనపడ్డాయి. అనంతరం మిషన్ భగీరథ పథకంలో కోదండాపురం ప్లాంట్ నుంచి హాలియాలో పంపింగ్ ద్వారా నిడమనూరుకు తాగునీరందిస్తున్నారు. ఇది కూడా పూర్తిస్థాయిలో రాకపోవడంతో ఎస్సీ కాలనీ, గంగమ్మ గుడి, ఎన్ఎస్పీ క్యాంపుల్లోని ఓవర్ హెడ్ ట్యాంకులు నిండక అరకొరగా తాగునీరు సరఫరా అవుతున్నాయి. మరో వైపు పాత పైపులైన్లకు మిషన్ భగీరథ వాటర్ పైప్‌లైన్ అనుసంధానం చేయడంతో పైప్‌లైన్లు మరమ్మతులకు గురై నీటి సరఫరా నిలిచిపోతుంది. ఇప్పటికైనా శాశ్వత పైప్‌లైన్, పాత పంపులకు, సంపులకు కొత్త మోటార్లు ఏర్పాటు చేసి తాగునీరందించాలని స్థానికులు కోరుతున్నారు.



మరమ్మతులకు గురైన నిడమనూరు పంప్‌హౌస్ వద్ద ప్రధాన పైప్‌లైన్

నీటి సరఫరా మెరుగుపరచాలి



తాగునీటి సరఫరాలో నిడమనూరు పంచాయతీ విఫలమవుతోంది. ప్రధానంగా నెలలో వారం రోజుల పాటు ఎక్కడో ఓ చోట పైప్‌లైన్ మరమ్మతులతో తాగునీరు సరఫరా నిలిచిపోతుంది. దీంతో తాగునీరు, ఇతర నీటి అవసరాలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. నీటి సరఫరా మెరుగుపరచాలి.

– పెదమాము రాజు, సామాజిక ఉద్యమకారుడు

మంచినీటి పథకాలకు మరమ్మతులు లేవు



కొన్నేళ్లుగా పంచాయతీ పరిధిలోని చేతి పంపులు, పవర్ బోర్లకు మరమ్మతులు చేయకపోవడంతో పూర్తిగా మిషన్ భగీరథ నీటిపైనే ఆధారపడాల్సి వస్తోంది. నీటి వనరులు ఉన్న చెరువు పక్కన, ఎస్సీ కాలనీల్లో పవర్ బోర్లు ఏర్పాటు చేస్తే మిషన్ భగీరథపై ఆధారపడకుండా తాగునీరందుతుంది.

– కిరణ్ కుమార్, నిడమనూరు

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

- ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్

చందంపేట : రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను నిర్వహిస్తోందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. గురువారం నేరెడుగొమ్ము మోడల్‌స్కూల్‌లో ఆర్‌ఓ వాటర్ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలనే ఉద్దేశంతో ఆర్‌ఓ వాటర్‌ప్లాంట్ ప్రారంభించినట్లు తెలిపారు. పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వెంకటయ్యగౌడ్, కోతి యుగేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు గోవింద్‌యాదవ్, బిక్కునాయక్, బాలునాయక్, పాపానాయక్, కిన్నెర హరికృష్ణ, కొండల్‌రెడ్డి, గడ్డం వెంకటయ్య, సురేందర్‌రెడ్డి, తహసీల్దార్ ఉమాదేవి, ఎంపీడీఓ నీలిమ, ఎంఈఓ బ్రహ్మాచారి, ప్రిన్సిపాల్ కొర్ర శిరీష, లాలునాయక్, శ్రీనివాస్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



మిర్యాలగూడ టౌన్: బాలికల ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న సీడీపీఓ మమత



నిడమనూరు : ముకుందాపురం అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవం

కొండమల్లేపల్లి : సంపూర్ణ ఆరోగ్యానికి గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలని సీడీపీఓ కతీజ అన్నారు. గురువారం కొండమల్లేపల్లిలోని 4వ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణ అభియాన్ కార్యక్రమంలో ఆమె పాల్గొని పోషకాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వరలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు జ్యోతి పాల్గొన్నారు.

చిరు ధాన్యాలపై అవగాహన ఉండాలి

మిర్యాలగూడ టౌన్ : చిరుధాన్యాలపై అవగాహన కలిగి ఉండాలని, కేవలం అన్నమే కాకుండా రకరకాల చిరు ధాన్యాల పోషకాహారంగా తీసుకోవాలని సీడీపీఓ రేఖల మమత అన్నారు. గురువారం మిర్యాలగూడలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ మాసం నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలు తినే పౌష్టికాహారం, రక్తహీనత, కిశోర బాలికలు రుతుచక్ర సమయంలో తీసుకోవాల్సిన పరిశుభ్రతపై వివరించారు. పౌష్టికాహారంతో పాటు పిల్లలకు శారీరక వ్యాయామం చాలా అవసరమన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నజిమాబేగం, మహ్మద్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయకుమారి, బ్లాక్ కోఆర్డినేటర్ కవిత, అంగన్‌వాడీ టీచర్లు తూడి అరుణ, నిర్మల, నాగమణి, ధనలక్ష్మి, షమిమా, ప్రమీల, రమా, జానకి, షమీమ్, భారతి, రేవతి, శివలీల, ఉమారాణి, ప్రమీల, నసీమా, పద్మ తదితరులున్నారు.

పోషకాహారంపై అవగాహన

అడవిదేవులపల్లి : అడవిదేవులపల్లి మండలం చిట్యాల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగరాణి పోషకాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి కృష్ణారెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు చంద్రశేఖర్, ఉపేంద్ర, అంగన్‌వాడీ టీచర్లు భూ లక్ష్మి, కుమారి, లలిత తదితరులున్నారు.

నిడమనూరు : పోషణ మాసోత్సవంలో భాగంగా నిడమనూరు మండలంలోని ముకుందాపురం గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం చిన్నారుల తల్లులకు, బాలింతలకు, గర్భిణులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. చిన్నారులకు అక్షరాభ్యాసం, గర్భిణులకు సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ సువర్ణ, సెక్టార్ సూపర్‌వైజర్ ఫరిదా, పంచాయతీ కార్యదర్శి వెంకట్రావు, అంబటి నాగమణెమ్మ, అరుణ, ప్రేమలత, జ్యోతి, ఏఎన్ఎం సుచిత్ర పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

త్రిపురారం : గర్భిణులు సమతుల్యమైన పోషకాహారం తీసుకుంటే పుట్టబోయే బిడ్డలు కూడా ఆరోగ్యంగా ఉంటారని సీపీడీఓ నూనె చంద్రకళ అన్నారు. పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా గురువారం త్రిపురారం మండల కేంద్రంలోని రైతు వేదికలో దామరచర్ల ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతం, చిన్నారులను అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీడీఓ చంద్రకళ మాట్లాడుతూ.. బిడ్డ పుట్టిన నాటి నుంచి ఆరు నెలల లోపు వరకు బిడ్డలకు తల్లి పాలు పట్టించాలన్నారు. కార్యక్రమంలో త్రిపురారం ఎంపీడీఓ విజయ కుమారి, ఎంఈఓ రవి నాయక్, మండల వైద్యాధికారి మాలోతు సంజయ్, ఏపీఎం నాగేందర్, రమణి, అశ్రిత, సూపర్ వైజర్లు వెంకటమ్మ, మల్లీశ్వరి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

హాలియా జెడ్పీహెచ్ఎస్‌లో పోషణ మాసం

హాలియా: పోషణ మాసంలో భాగంగా గురువారం హాలియా సెక్టార్ పరిధిలోని హాలియా జెడ్పీహెచ్ఎస్‌లో పౌష్టికాహారంపై అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏసీడీపీఓ సువర్ణ మాట్లాడుతూ.. కిశోర బాలికలు తీసుకోవాల్సిన పోషకాహారం, పాటించాల్సిన పరిశుభ్రత, సరైన తాగునీరు రక్తహీనత రావడానికి గల కారణాలు వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రమాదేవి, హెచ్‌ఎం కృష్ణమూర్తి, సీడబ్ల్యూసీ వెంకన్న, లుర్దు మేరీ, అనసూయ, వజ్రమ్మ, విజయలక్ష్మి, నర్మద, పుష్ప, అండాలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్ష పదవికి దరఖాస్తుల అందజేత

మిర్యాలగూడ: డీసీసీ అధ్యక్షుడిగా తమకు అవకాశం కల్పించాలని కోరుతూ ఏఐసీసీ కార్యదర్శి మహంతికి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్‌ల సమక్షంలో మైనార్టీ జిల్లా చైర్మన్ మహమ్మద్ అబ్దుల్ సలీం, జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు పగిడి రామలింగయ్య గురువారం దరఖాస్తులు సమర్పించారు. ఈ సందర్భంగా సలీం మాట్లాడుతూ.. గత 20 సంవత్సరాలుగా తాను కాంగ్రెస్ పార్టీలో విధేయుడిగా ఉంటూ పార్టీ ఆదేశాల మేరకు ప్రతి ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయం కోసం కృషి చేశానని తెలిపారు. రామలింగయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో అనేక పార్టీ పదవులు చేపట్టానని, తనకు డీసీసీ అధ్యక్ష పదవి అప్పగిస్తే సమర్థవంతంగా నిర్వహిస్తానని పేర్కొన్నారు.



మహంతికి దరఖాస్తు అందజేస్తున్న సలీం

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి

త్రిపురారం : రైతులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ నాగేందర్ అన్నారు. గురువారం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో త్రిపురారం, రాజేంద్ర నగర్ గ్రామాల్లో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఇప్పటివరకు 32 ఆవులు, 396 గేదెలకు టీకాలు పూర్తి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నిడమనూరు అసిస్టెంట్ డైరెక్టర్ జూలకంటి వెంకట్ రెడ్డి, డాక్టర్ శశికళ, సిబ్బంది సయ్యద్, శ్రీనివాస్, ఆసీమ్ హుస్సేన్, రామకోటి, కృష్ణ, రేణుక, వెంకటేశ్వర్లు, భవాని పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి



సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ శ్రీనివాస్

మిర్యాలగూడ టౌన్ : మున్సిపాలిటీలో పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. గురువారం మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇళ్లలోని చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా చెత్త సేకరణ వాహనాల్లో వేయాలన్నారు. అదేవిధంగా మున్సిపాలిటీలో నడుస్తున్న అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులు పరిశీలించారు. ప్రధానంగా వీధి దీపాలు, డ్రెయినేజీ, పారిశుద్ధ్యం, మంచినీటి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మున్సిపల్ మాజీ చైర్మన్ మెరుగు రోశయ్య, మాజీ కౌన్సిలర్ పందిరి అనిత, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ తదితరులున్నారు.

నేడు హాలియాలో నెట్‌బాల్ ఎంపిక పోటీలు

నల్లగొండ టూటౌన్: హాలియా పట్టణంలోని దేవరకొండ రోడ్డులో గల టైం స్కూల్‌లో శుక్రవారం ఉదయం 9 గంటలకు అండర్-14, 17 బాలబాలికల ఉమ్మడి జిల్లా స్థాయి నెట్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) కార్యదర్శి విమల గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాల్గొనదల్చిన బాలబాలికలు పూర్తి వివరాలకు సెల్ : 9160494743 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

సర్టిఫికెట్ల పంపిణీ

నల్లగొండ: డిసైపిల్ బైబిల్ కోర్సు గ్రాడ్యుయేషన్ (ఒక సంవత్సరం) పూర్తి చేసిన వారికి ఎస్‌టీసీ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో గురువారం నల్లగొండలోని జేసీసీ (క్రీస్తు ప్రార్థనా మందిరం)లో డైరెక్టర్ అజయ్‌పాల్ సర్టిఫికెట్లు అందజేశారు.



సర్టిఫికెట్లు అందుకున్న వారితో డైరెక్టర్ అజయ్‌పాల్

అక్రమ నిర్మాణం తొలగించాలి



ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ముతావలిలు, వారి కుటుంబసభ్యులు

దేవరకొండ: దేవరకొండ పట్టణంలోని సర్వే నంబర్ 405లో చేపట్టిన అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని డిమాండ్ చేస్తూ గురువారం దేవరకొండ పట్టణంలోని హజ్రత్ సయ్యద్ సులేమాన్ షావలిఖాద్రి దర్గా ముతావలిలు, కుటుంబసభ్యులు ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే నంబర్ 405 దర్గా ఇనాం భూమిలో ఉన్నట్లు అధికారులు నిర్ధారించారన్నారు. సర్వే నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామన్న మున్సిపల్ అధికారులు స్పందించకపోవడంతో కలెక్టర్ దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అహ్మద్ బాబా, అమ్జద్, సిద్ధిక్, బషీర్, ఖాదర్, ఫయాజ్ తదితరులున్నారు.

రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలి



మిర్యాలగూడ టౌన్ : కరపత్రం విడుదల చేస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు



దేవరకొండ: అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

మిర్యాలగూడ టౌన్ : 42 శాతం బీసీ రిజర్వేషన్ల కోసం బీసీ జేఏసీ పిలుపుమేరకు శనివారం నిర్వహించే తెలంగాణ బంద్‌లో విద్యార్థులందరూ భాగస్వాములు కావాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు గండిచెరువు వెంకన్న, జిల్లా అధ్యక్షుడు అయితగోని జనార్దన్, మిర్యాలగూడ డివిజన్ జేఏసీ అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు పిలుపునిచ్చారు. గురువారం ఎన్ఎస్పీ క్యాంపులో గల మహాత్మా జ్యోతిరావ్ పూలే బీసీ భవనంలో తెలంగాణ బంద్ కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు మాదగోని మహేష్ గౌడ్, బీసీ జేఏసీ కో కన్వీనర్ జయరాజు, బీసీ సంఘాల నాయకులు బంటు వెంకటేశ్వర్లు, మురళియాదవ్, సత్యప్రకాశ్‌నాయుడు తదితరులున్నారు.

బీసీ బంద్‌కు సీపీఐ సంపూర్ణ మద్దతు

మిర్యాలగూడ అర్బన్: బీసీ రిజర్వేషన్లను కేంద్ర ప్రభుత్వం 9వ షెడ్యూల్లో చేర్చాలని, బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ శనివారం నిర్వహించే బీసీ బంద్‌కు సీపీఐ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు ఆపార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం మిర్యాలగూడలోని స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఎండీ సయ్యద్, బిల్లా కనకయ్య, ధీరావత్ లింగానాయక్, గోగుల యాదగిరి, ఎర్రబోతు పద్మ, శాంత, బంటు రాజేశ్వరి, రమేష్, రాములు పాల్గొన్నారు.

42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

దేవరకొండ: బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేశాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ పొలిటికల్ జేఏసీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు చింతపల్లి సతీష్‌గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం దేవరకొండ పట్టణంలో నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ల వ్యతిరేకులకు నిరసనగా ఈనెల 18న నిర్వహించే బీసీ బంద్‌లో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో తోటపల్లి మల్లేష్, సత్యం గౌడ్, ధనరాజ్, రమేష్, శివ, సిద్ధు, మహేష్, గోపి, సతీష్, శేఖర్ తదితరులున్నారు.

దేవరకొండ: రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. గురువారం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో దేవరకొండ పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి మాట్లాడారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేశాకే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వరికుప్పల శ్రీను, కోటేశ్వరరావు, కలాం, లక్ష్మణ్‌నాయక్, బాషా, శాంసన్, యాదయ్య, శివ, కృష్ణమాచారి, శ్రీనివాసచారి, భానుచందర్, కృష్ణప్రసాద్, వెంకట్ తదితరులున్నారు.

మాడుగులపల్లి: బీసీ రిజర్వేషన్ల సాధనకు బీసీ జేఏసీ ఇచ్చిన పిలుపుమేరకు శనివారం నిర్వహించే రాష్ట్ర బంద్‌లో బీసీలందరూ పార్టీలకతీతంగా పాల్గొని విజయవంతం చేయాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా కార్యదర్శి భూపతి నరేష్‌గౌడ్ అన్నారు. గురువారం మాడుగులపల్లి మండల కేంద్రంలో బంద్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. బీసీలకు జరుగుతున్న అన్యాయాన్ని దేశానికి వినిపించేందుకు బంద్ నిర్వహిస్తున్నామని తెలిపారు. బీసీలకు న్యాయం జరిగే వరకూ పోరాటం ఆపేది లేదన్నారు. కార్యక్రమంలో కోల గుమ్మస్వామి, పందిరి రాజశేఖర్, పర్వన బోయిన లక్ష్మణ్, బొల్లెపల్లి రాజు, చిత్తలూరి శంకర్, భూపతి మహేష్, విఘ్నేష్, ఉపేందర్, రామకృష్ణ, చంద్రశేఖర్, బంటు సైదులు, నగేష్, అచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

గుంతల రహదారులు

తిరుమలగిరి(నాగార్జునసాగర్): అల్వాల ఎక్స్ రోడ్డు నుంచి డొక్కలబావితండాకు వెళ్లే ప్రధాన రహదారి మధ్యలో లోతైన గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. ఇటీవల కురిసిన వర్షాలకు గుంతల్లో నీరు నిలిచాయి. దీంతో గుంతల లోతు కనిపించక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి గుంతలను పూడ్చి సమస్యను పరిష్కరించాలని వాహనదారులు కోరుతున్నారు.



బడాయిగడ్డ బంధం వద్ద..



తిరుమలగిరి శ్రీనివాస జంక్షన్ వద్ద రోడ్డుపై ఏర్పడిన గుంతలు

హిందూ శ్మశానవాటిక లేకపోవడం బాధాకరం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్: నల్లగొండలోని 3 వార్డులు గల చర్లపల్లిలో హిందూ శ్మశానవాటిక లేకపోవడం బాధాకరమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి అన్నారు. గురువారం నల్లగొండలో పార్టీ టూటౌన్ ప్రధాన కార్యదర్శి కటకం శ్రీధర్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరాహార దీక్షలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. శ్మశానవాటిక విషయమై మున్సిపల్ కమిషనర్‌కు విన్నవించినా ఉపయోగం లేకుండా పోయిందన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గోలి మధుసూదన్‌రెడ్డి , వీరెల్లి చంద్రశేఖర్, పోతపాక లింగస్వామి, పకీరు మోహన్ రెడ్డి, మిర్యాల వెంకటేశం, గడ్డం మహేష్ తదితరులు పాల్గొన్నారు.